

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం

13 డిసెంబర్ 2025 పేజీలు : 08

## ఏపీ మత్స్యకారుల ప్రయోజనాలు కాపాడండి



- లోక్‌సభలో మత్స్యకారుల సమస్యలను ప్రస్తావించిన ఎంపీ వేమిరెడ్డి
- ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులకు ప్రత్యేక ఆర్థిక భరోసా కల్పించండి

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

దేశంలో 974 కిలోమీటర్లతో రెండో అతిపెద్ద తీర ప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మత్స్యకారుల ప్రయోజనాలు కాపాడాల్సిన అవసరం ఉందని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే మెకనైస్డ్ స్టీల్ బోట్స్ వల్ల నెల్లూరులోని జువ్వల దిన్నె, ఇస్కపల్లి ప్రాంతాల్లో మత్స్య సంపదను దోచుకుంటున్నారని, దాంతో స్థానిక మత్స్యకారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడటంతో పాటు అభద్రతా భావానికి

-మిగతా 2లో

## జిల్లాను అగ్రభాగంలో ఉంచాలి

### 20 సూత్రాల పథక చర్మన్ లంకా దినకర్




జిల్లాను విద్య, వైద్య రంగంలో ముందు నిలిచే విధంగా ఆయా శాఖలు సమన్వయంతో పని చేసి, వికసిత భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేయాలని 20 సూత్రాల పథక చర్మన్ లంకా దినకర్ సంబంధిత అధికారులను కోరారు.

వివరాలు 3లో

## లేడీ డాన్ నిడిగుంట అరుణపై పీడీ యాక్ట్ నమోదు

- ఎస్పీ ప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోదం
- కేంద్ర కారాగారం నుంచి కడప సెంట్రల్ జైలుకు తరలింపు
- జయప్రకాశ్, షేక్ షాహుల్ హమీద్ అనే మరో ఇద్దరిపై పోలీసులు పీడీ యాక్ట్
- నెల్లూరు నుంచి ముగ్గురిని కడప జైలుకు తరలింపు

05 పేజీలో




## ఆగని.. తమ్ముళ్ల గ్రావెల్ దందా !





- తమకు అనుమతులు ఉన్నాయంటూ.. తెలుగు తమ్ముళ్ల దబాయింపు
- ఎవరికీ అనుమతులు ఇవ్వలేదంటున్న తహసిల్దార్
- అక్రమ గ్రావెల్‌ను అడ్డుకునే వారెవరు ?



పొదలకూరు, మేజర్‌న్యూస్ :

పొదలకూరులో తెలుగు తమ్ముళ్ల గ్రావెల్ దందాకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. చిట్టేపల్లి తిప్ప నుంచి పొదలకూరులోని ప్లాట్లు, లే అవుట్‌లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. పొదలకూరు తెలుగుదేశం పార్టీలో యువ నాయకులుగా చెలామణి అవుతున్న ఒకరిద్దరు.. ఈ గ్రావెల్ దందా నడుపుతున్నారని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయ కు లు అక్రమంగా గ్రావెల్ తరలించరాదని చెబుతున్నా.. కూటమి నాయకులు ఇప్పుడు జరుగుతున్న గ్రావెల్ దందా గురించి ఏం సమాధానం చెబుతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గత రెండు రోజుల క్రితం చిట్టేపల్లి తిప్ప నుంచి రాత్రి 10 గంటల తరువాత అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని, అక్కడి ప్రజలు మీడియాకు సమాచారం ఇచ్చారు. అసలె అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకుందామని మీడియా సోదరులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. పొదలకూరు - కలువాయి రోడ్డు పక్కనే ఉన్న చిట్టేపల్లి తిప్ప నుంచి జేసీబీతో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి గ్రావెల్ పొదలకూరుకు తరలిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన మీడియాకు తమకు

-మిగతా 2లో

## టీడీపీ కార్పొరేటర్లకు స్పెషల్ టూర్ !



నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

మేయర్ పోట్లూరి స్రవంతి అవిశ్వాస తీర్మానానికి ముందే నగరపాలక సంస్థలో రాజకీయం రసవత్తరంగా మారింది. అధికార తెలుగుదేశం పార్టీ వైపు ఉన్న కార్పొరేటర్‌లను వైఎస్‌ఆర్సిపి వైపు వెళ్లకుండా వారిని నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గం సంబంధించిన కార్పొరేటర్‌లను శుక్రవారం వివిధ ప్రాంతాలకు క్యాంపుకు తరలించారు. తెలుగుదేశం పార్టీ నుంచి నగర నియోజకవర్గం నుంచి నలుగురు కార్పొరేటర్లు, నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి 34 డివిజన్ కార్పొరేటర్ ఎస్కే ఫామీదా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో పార్టీలో చేరిన విషయం తెలిసిందే. అదేవిధంగా నగర నియోజకవర్గానికి చెందిన ఐదో డివిజన్ కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరి మళ్లీ తెలుగుదేశం పార్టీలోకి రావడం జరిగింది. నగర పాలక సంస్థ మేయర్ పోట్లూరి స్రవంతిపై అవిశ్వాసానికి సంబంధించి 18వ తేదీ సమావేశం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే అవిశ్వాసానికి ముందే కొంతమంది కార్పొరేటర్లు ఆయా పార్టీ నాయకులపై అసంతృప్తితో పార్టీ వీడి వెళ్ళిపోతున్నారడంతో తెలుగుదేశం పార్టీ వారిని క్యాంపుకు తరలించింది. నగర నియోజకవర్గానికి సంబంధించి 16 మంది

-మిగతా 2లో

# జిల్లాను అగ్రభాగంలో ఉంచాలి

### 20 సూత్రాల పధక చర్మన్ లంకా దినకర్




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాను విద్యా, వైద్య రంగంలో ముందు నిలిచే విధంగా ఆయా శాఖలు సమన్వయంతో పని చేసి, వికసిత భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేయాలని 20 సూత్రాల పధక చర్మన్ లంకా దినకర్ సంబంధిత అధికారులను కోరారు. శుక్రవారం నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో 20 పాయింట్ ప్రోగ్రాం అమలులో భాగంగా విద్య, వైద్య అనుబంధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, శాసన మండలి సభ్యులు బీదా రవిచంద్రా, నుడా చైర్మన్ కోటం రెడ్డి శ్రీనివాసుల రెడ్డిలతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించిన అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.. ఫిబ్రవరి-2025 మాసంలో తొలి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగిందని, నేడు రెండవ సమీక్షా సమావేశంలో విద్య, వైద్యంపై సమీక్షించామని తెలిపారు. డొక్కా మాణిక్యమ్మతో మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం, తల్లితండ్రులు- ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించుట ద్వారా పిల్లల పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకునే వెసులుబాటు కల్పించడం జరిగిందని, విద్యా రంగంలో చేస్తున్న సంస్కరణలు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రాధాన్ తనతో ప్రస్తావించారని, తద్వారా ఇతర రాష్ట్రాలలో అమలు చేయాలన్నారన్నారు. పలు విషయాలలో ఆంధ్రప్రదేశ్ ఒక మోడల్ కావాలని లంకా దినకరన్ అన్నారు. పలు పథకాల అమలుపై గ్రామీణ నీటి సరఫరా, మునిసిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో విపులంగా సమీక్షించడం జరిగిందన్నారు. ప్రధాన మంత్రి మాత్రు వందనం, జనని శిశు సంక్షేమం పథకాలపై సమీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. మునిసిపాలిటీలకు సి.యఫ్.యం.యస్ ద్వారా నిధులు అందించుట ద్వారా నెల్లూరు కార్పొరేషన్‌కు నెలకు 6 నుండి 7 కోట్ల రూపాయలు వస్తున్నాయన్నారు.

అనీమియా ముక్త భారత్‌కు అందరూ కృషి చేయాలన్నారు. మాత్రు అభియాన్ క్రింద రక్త పరీక్షలు ప్రత్యేక డాక్టర్లచే నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 100 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలో జరుగుతున్నాయని ఏప్రిల్ నుండి అక్టోబర్ వరకు 3153 ప్రసవాలు జరిగాయన్నారు. జిల్లాలో 497 ఆయుష్ మందిరాలు సేవలు అందిస్తున్నయన్నారు. రాష్ట్రీయ బాల స్వస్త కార్యక్రమం ద్వారా చిన్న పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారి శస్త్ర చికిత్సలు, కళ్ళ జోళ్ళు అందించడం జరుగుతుందన్నారు. నెల్లూరు జిల్లాలో నాలుగు డయాలసిస్ కేంద్రాలు కందుకూరు, ఆత్మకూరు, పొదలకూరు, వింజమూరులలో ఉన్నాయని, ఇప్పటి వరకు గత సంవత్సరం నుండి నేటి వరకు సుమారు 8700 మందికి 46 వేల వరకు సెషన్స్ చేపట్టారన్నారు. అంగ వైకల్యం కలిగిన వారికి అందించే సదరన్ సర్టిఫికెట్లు 2024-2025 సంవత్సరంలో 6282 మందికి 2025-2026 సంవత్సరానికి ఇపటి వరకు 2361 మందికి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఐయంఆర్ (చిన్నపిల్లల మొర్టాలిటి రేట్) వెయ్యి మందికి నలుగురుగా నమోదైందని, అదేవిధంగా యం.యం.ఆర్ (మదర్ మొర్టాలిటి రేట్) కొంచెం హెచ్చుగా ఉందని, ఈ విషయమై తగు శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించడం జరిగిందన్నారు. జిల్లాలో 108 వాహనాలు-40, 104 వాహనాలు-43, 102 వాహనాలు-20 సేవలు అందిస్తున్నాయన్నారు. సేవలు అందించడంలో మరింత తొందరగా సేవలు అందిచేలా చూడాలని సూచిచడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 70 శాతం ఆయుష్ కార్డులు ఇప్పటి వరకు అందించడం జరిగిందన్నారు. జిల్లాలో తల్లికి వందనం కార్యక్రమం ద్వారా సుమారు 2506 స్కూల్స్‌లలో 2.90 లక్షల మందికి 434 కోట్ల రూపాయలు చెల్లించడం జరిగిందన్నారు.

# ఆగని తమ్ముళ్ళ గ్రావెల్ దందా !

*(మొదటి పేజీ తరువాయి)*



ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని, తాము ఏఎం ఆర్ సంస్థకు నగదు చెల్లించి అధికారికంగా గ్రావెల్ తరలిస్తున్నామని తెలుగు దేశం పార్టీ యువ నాయకుడు బదులిచ్చాడు. అనుమతులుంటే దొంగల్లా రాత్రివేళ ఎందుకు తలరిస్తున్నారన్న ప్రశ్నకు.. పగలైతే ప్రజలకు ఇబ్బంది ఉంటుందని, కావున రాత్రి సమయాల్లో తోలుతున్నామని తెలివిగా సమాధానం చెబుతున్నారు. కాగా రెవెన్యూ అధికారులు మాత్రం పొదలకూరు మండలంలో గ్రావెల్ తవ్వి తరలించుకునేందుకు ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు. అయితే గ్రావెల్ రవాణా విషయంలో తెలుగు తమ్ముళ్లు చెబుతున్న మాటలకు.. అధికారులు చెబుతున్న దానికి పొంతన లేకపోవడంతో అక్రమ గ్రావెల్ రవాణాను అడ్డుకునే వారు ఎవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రకృతి సంపదను అక్రమంగా తరలిస్తున్న తెలుగు తమ్ముళ్లను కట్టడి చేయాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

### ఎవరికి అనుమతులు ఇవ్వలేదు : తహసిల్దార్




పొదలకూరు మండలంలో గ్రావెల్ తవ్వి తరలించుకునేందుకు ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తే మైనింగ్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

### అనుమతులు తప్పనిసరి.. : జేసీ వెంకటేశ్వర్లు



ఎవరైనా ఎంతటి వారైనా గ్రావెల్ తవ్వి తరలించుకోవాలంటే అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. గ్రావెల్ తవ్వి తరలించాలంటే మైనింగ్ శాఖకు సీనరేజీ చార్జీలు చెల్లించి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అనుమతులు ఉన్నప్పటికీ రాత్రివేళలో ఎలాంటి మైనింగ్ కార్యకలాపాలు చేయకూడదు. నిర్దేశించిన సమయంలో మాత్రమే రవాణా చేసుకోవాలి.

# ఏపీ మత్స్యకారుల ప్రయోజనాలు కాపాడండి




*(మొదటి పేజీ తరువాయి)*

గురవుతున్నారన్నారు. ఈ మేరకు శుక్రవారం లోక్‌సభలో ఏపీలోని మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ సముద్ర చేపల ఉత్పత్తి, లోతైన సముద్ర చేపలు పట్టడం, సముద్ర ఆహార ఎగుమతులు, ఆక్వాకల్చర్‌కు భారతదేశంలో అతిపెద్ద దోహదపడే రాష్ట్రాలలో ఒకటని, ఇక్కడి మత్స్యకారులు భారతదేశ నీలి ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అన్నారు. అయినప్పటికీ, వారు డీప్ సీ ఫిషింగ్ బోట్ల సమస్య వంటి తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాం న్నారు. 12 సంవత్సరాలకు పైగా, నెల్లూరు జిల్లాలోని జువ్వలదిన్నె, ఇసుకపల్లిలోని మత్స్యకారులు తమిళనాడు, పుదుచ్చేరి నుంచి వస్తున్న మెకనైజ్డ్ స్టీల్ బోట్ల చొరబాట్లను పదేపదే ఎదుర్కొన్నారనీ, ఇవి ఆంధ్ర జలాల్లోకి ప్రవేశించి, లక్షల విలువైన వలలను నాశనం చేస్తూ, వారి వేటను స్వాధీనం చేసుకుంటున్నాయని, దీంతో తరచుగా ఘర్షణలు చెలరేగుతున్నాయన్నారు. దీని ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లోని సాంప్రదాయ మత్స్యకారులకు తీవ్ర ఆర్థిక నష్టంతో పాటు అభద్రత ఏర్పడుతోందని సభ దృష్టికి తెచ్చారు. ఈ ఒత్తిళ్ల కారణంగా, సాంప్రదాయ మత్స్యకారులలో చాలామంది ఇప్పుడు లోతైన సముద్ర చేపల వేట వైపు మళ్లాలని కోరుకుంటున్నారనీ, అయితే ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద ప్రస్తుత సబ్సిడీ సరిపోవటం లేదన్నారు. లోతైన సముద్ర నౌక యొక్క యూనిట్ ధర రూ.120 లక్షలు కాగా, ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులకు రూ.72 లక్షలు, ఓబీసీ మత్స్యకారులకు రూ.48 లక్షలు మాత్రమే సబ్సిడీ ఉందన్నారు. చాలా సాంప్రదాయ కుటుంబాలకు, ఈ ఖర్చు అందనంత దూరంలో ఉందన్నారు. అలాగే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభోత్సవం తర్వాత కూడా, నౌకాశ్రయాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడానికి తగినంత లోతైన సముద్ర పడవలు లేవనీ, బదులుగా మత్స్యకారులకు సుమారు రూ.60 లక్షల ఖరీదు చేసే మధ్య తరహా పడవల కొనుగోలుకు మద్దతు కావాలన్నారు. ఈ సందర్భంగా మత్స్యకార మంత్రికి.. తీర మండలాలను నిరంతరం పర్యవేక్షించడానికి, అక్రమ బోట్ల ప్రవేశాన్ని నిరోధించడానికి, సాంప్రదాయ మత్స్యకారుల ప్రయోజనాల రక్షణను ఉమ్మడి అంతర్-రాష్ట్ర సమన్వయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించారు. ప్రస్తుత నౌకాదళాల బలం పొరుగు రాష్ట్రాలతో పోటీ పడటానికి సరిపోనందున, ముఖ్యంగా లోతైన సముద్ర చేపల వేట వైపు మొగ్గు చూపేందుకు ఏపీ మత్స్యకార సమాజానికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలను అందించాలని వివరించారు. ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులు కష్టపడి పనిచేసేవారని, భారతదేశ సముద్ర ఆర్థిక వ్యవస్థకు కీలకమైనవారని పేర్కొన్నారు. వారి భద్రత, మెరుగైన మౌలిక సదుపాయాలు, లోతైన సముద్ర చేపల వేటకు మద్దతు ఇవ్వాలన్నారు. అందువల్ల, సరిహద్దుల మధ్య జరిగే అక్రమ చొరబాట్లను పరిష్కరించడానికి, ఏపీ మత్స్యకారుల కోసం సబ్సిడీ నిబంధనలను సవరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని లోక్ సభలో కోరారు.

## టీడీపీ కార్పొరేటర్లకు స్పెషల్ టూర్..

*(మొదటి పేజీ తరువాయి)*

కార్పొరేటర్ లను నెల్లూరు రూరల్ నియోజకవర్గం సంబంధించి 20 మంది కార్పొరేటర్‌లను క్యాంపుకు తరలించినట్లు సమాచారం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించి కార్పొరేటర్ మాత్రం ఆయా నాయకుల వద్ద వారి సూచనల మేరకు ఉన్నట్లు సమాచారం. నగరపాలక సంస్థలో మేయర్‌పై అవిశ్వాసానికి సంబంధించి 18వ తేదీ ప్రకటించి ఉన్న విషయం తెలిసిందే. దీంతో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఉంది. తెలుగుదేశం పార్టీలో కార్పొరేటర్లు ఎక్కడికి వెళ్లకుండా ఆ పార్టీ నాయకులు వారిని క్యాంపుకు తరలించినట్లు తెలిసింది. మొత్తం మీద నగరపాలక సంస్థలో రాజకీయం ఏ మలుపు తిరుగుతుందోనని అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# 20వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** 14 నుండి 20 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు సందర్భంగా శుక్రవారం నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు ఇంధన సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి రూపొందించిన పాంప్లెట్లు, పోస్టర్లను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెంట్ ఇంజనీర్ కె.రాఘవేంద్రం, జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ బాల చంద్ర, శ్రీధర్, బెనర్జీ, భాను నాయక్, లక్ష్మీ నారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు. అవసరానికి మించి వినియోగాన్ని తగ్గించడం, సాంకేతికపరమైన ఉత్తమ పద్ధతుల ద్వారా ఇంధన సామర్థ్యాన్ని పెంచడం వంటి అంశాలు ప్రతి పౌరుడు ఆచరణలో పెట్టాల్సిన అవసరాన్ని అధికారులు ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇంధన పొదుపు చర్యలు పర్యావరణ పరిరక్షణకు, వనరుల సుస్థిర వినియోగానికి తోడ్పడతాయని పేర్కొన్నారు. అదనంగా, ప్రభుత్వ విభాగాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, సామాజిక సంస్థలు ఇంధన సంరక్షణ చర్యల్లో చురుకైన పాత్ర పోషించాలని, ప్రస్తుత తరానికి మాత్రమే కాక భవిష్యత్ తరాలకు కూడా శుభ్రమైన, స్థిరమైన వాతావరణాన్ని అందించేందుకు అత్యంత అవసరమని అధికారులు పిలుపునిచ్చారు.

# నాణ్యత ప్రమాణాలతో పూడికతీత పనులు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండల పరిధిలోని శంకవరం గ్రామంలో చెరువు సంబంధిత పంట కాలువల పూడికతీత పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ఇరిగేషన్ ఏఈ మహేంద్ర పేర్కొన్నారు. శుక్రవారం శంఖవరం చెరువు నుండి ప్రధాన పంట కాలువలు సుమారు 4.5 కిలోమీటర్లు మేర జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంకవరం చెరువు పరిధిలో సుమారు 270 ఎకరాలు భూమి సాగులో ఉందన్నారు. అందులో 110 ఎకరాలు ఎర్రబల్లి పరిధిలో 160 ఎకరాలు శంఖవరం పరిధిలో భూములు రైతులు సాగు చేస్తున్నారన్నారు. రైతులకు నీటి ప్రవాహం సామర్థ్యం పెంచి నీటి సరఫరా చేసేలా ఈ పూడికతీత ఉపయోగపడుతుందన్నారు. పూడికతీత పనులు ప్రభుత్వ ప్రమాణాలుకు అనుగుణంగా చేపట్టవలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చెరువు సంఘ అధ్యక్షులు భూమిరెడ్డి పెంచల్ రెడ్డి చెరువు ఉపాధ్యక్షులు బోరెడ్డి హజరత్ రెడ్డి, నాయకులు చింతనబోయిన నరసింహులు, లక్ష్మీ ప్రసన్న, చెంచు నాయుడు, సంపూర్ణమ్మ, భూమిరెడ్డి నరసింహారెడ్డి, భూమిరెడ్డి భక్తవత్సల రెడ్డి, బోగిరెడ్డి రమణారెడ్డి, మాజీ సర్పంచి బక్క పోలయ్య, చింతనబోయిన సిసింద్రీ తదితరులు పాల్గొన్నారు.

# కుమార్తెపై అత్యాచారం చేసిన తండ్రికి యావజ్జీవ కారాగార శిక్ష

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మైనర్ కుమార్తెపై అత్యాచారం కేసులో నేరం రుజువు కావడంతో న్యాయస్థానం నిందితునికి యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు వింజమూరుఎస్సై వీర ప్రతాప్ తెలిపారు. వివరాల్లోకెళ్తే.. వింజమూరు మండలం బీసీ కాలనీకి చెందిన దశరథ తన బంధువులను చూచుటకు తన కుమార్తెను సైకిల్ పై ఎక్కించుకొని కలిగిరి మండలం సీతమ్మ చెరువు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తూ నేరేడుపల్లి గావెల్ రోడ్డు సమీపంలోని నిమ్మ తోట వద్ద కుమార్తెను బలాత్కారం చేసి మానభంగం చేసినట్లు బాధితురాలు తల్లికి సమాచారం అందించి తల్లితో కలిసి అప్పట్లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానం ద్వారా రిమాండ్ పంపడం జరిగిందన్నారు. శుక్రవారం న్యాయమూర్తి ఎస్.సుమ ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.25వేల జరిమానా విధించారు. కేసును త్వరితగదన విచారించి నిందితునికి శిక్షపడే విధముగా కావలి డీఎస్పీ ప్రసాద్, కలిగిరి సీఐ వెంకటనారాయణ, కానిస్టేబుల్ జీవి రమణయ్య కృషి చేశారని ఆయన తెలిపారు.

## శనివారం విద్యుత్‌కి అంతరాయం : ఏడీఈ

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో ఉన్న విద్యుత్ వినియోగదారులకు కావలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.రవికుమార్ మాట్లాడుతూ.. కావలి పట్టణంలో ఉన్న అన్ని సబ్ స్టేషన్లు మరమ్మత్తుల కారణంగా విద్యుత్‌కి అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులకు తెలిపారు. అలాగే విద్యుత్ వినియోగదారులు వాళ్ళ అవసరాలు నిమిత్తం వేరే ఏర్పాటు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ అంతరాయం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్‌కి అంతరాయం ఏర్పడుతుంది. రెండు గంటల తర్వాత మరల విద్యుత్తును యధావిధిగా సరఫరా జరుగుతుంది. పరిశ్రమ వాడకం దారులు, వాణిజ్య వినియోగదారులు, వ్యవసాయదారులు, ఆక్వా రైతు, సోదరులు, గృహ విద్యుత్ వినియోగదారులు ఈ విషయం గమనించాలని తెలిపారు.



## నేటి అర్ధరాత్రి నుంచి అయ్యప్ప గుడి ఫ్లైఓవర్ మూసివేత : కమిషనర్ వైఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో తూర్పు పడమర ప్రాంతాలను అనుసంధానం చేసే ప్రధానమైన అయ్యప్ప గుడి ఫ్లైఓవర్ మరమ్మత్తు పనుల దృష్ట్యా నేటి అర్ధరాత్రి నుంచి మూసివేస్తున్నట్లు కమిషనర్ వై.ఓ నందన్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి వచ్చే ఏడాది జనవరి నెల 10వ తేదీ వరకు మరమ్మతు పనులను చేపట్టి ఫ్లైఓవర్ ను ఆధునికరించనున్నామని కమిషనర్ వివరించారు. బ్రిడ్జిపై ఉన్న 20 జాయింట్లు పూర్తిస్థాయిలో దెబ్బతిని వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్న కారణంగా ఇంజనీరింగ్ విభాగం అధికారుల నేతృత్వంలో పూర్తిస్థాయిలో ఆధునికరించనున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. కావున వాహన చోదకులు సమన్వయం పాటించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దైనందిన ప్రయాణ కార్యక్రమాలను నిర్వహించుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేకమైన చర్యలను తీసుకుంటున్నట్లు నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లలో ప్రత్యేక కేంద్రాలలో మాత్రమే వీధి కుక్కలకు ఆహారాన్ని ప్రజలు అందించాలని, బహిరంగ ప్రదేశాలలో ఆహారాన్ని అందించడం నిషేధమని కమిషనర్ పేర్కొన్నారు. వీధి కుక్కల ద్వారా పెద్ద సంఖ్యలో దాడులు జరుగుతున్న కారణంగా సుప్రీంకోర్టు మార్గ నిర్దేశాలను అనుసరించి తగిన చర్యలను నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో తీసుకోబోతున్నామని కమిషనర్ స్పష్టం చేశారు. కావున నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలందరూ పై కార్యక్రమానికి సహకరించి వీధి కుక్కల నియంత్రణలో భాగస్వామ్యం కావాలని కమిషనర్ సూచించారు.

## లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** డిసెంబరు 13న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని కక్షిదారులకు లోకఅదాలత్ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి తెలిపారు. కోర్టుకు రాని కేసులు పెండింగ్ కేసులు ఖర్చు కాలయాపన లేని అప్పీల్ లేని అంతిమ తీర్పులను లోక్ అదాలత్‌లో ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. అలాగే కావలి న్యాయస్థానాల న్యాయమూర్తుల ఆధ్వర్యంలో డిసెంబరు 13న శనివారం కావలిలో జరుగు మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. లోక్ అదాలత్ లో నిరుపేదలకు, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత న్యాయ సహాయం న్యాయ సలహాలు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ మెగా జాతీయ లోక ఆధాలత్‌లో కొండాపురం, జలదంకి, కలిగిరి, కావలి, బోగోలు, మండలాల నుండి కక్షిదారులు సత్వర న్యాయం కొరకు ఈ లోక్ అదాలత్ సేవలను వినియోగించుకొని ప్రశాంతంగా జీవించాలని తెలిపారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గం పరిధిలో పలు పంచాయతీలకు చెందిన 74మందికి 65లక్షల రూపాయల సీఎం సహాయని చెక్కులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరుపేదలకు అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా చితికి పోకూడదని ఉద్దేశంతో వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం సహాయ నిధిని పెద్ద ఎత్తున మంజూరు చేస్తూ పేదలకు అందించాలని ఎమ్మెల్యేలకు సూచిస్తున్నారు అన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు ఇలాంటి సహాయనిధి అందేది కాదన్నారు. నేడు ప్రజల ప్రభుత్వం అందుకు తగ్గట్టుగానే ప్రజలను ఆదుకుంటూ సేవలం దిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల మండలాల నాయకులు లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

## టీడీపీ నాయకుడి మృతికి సంతాపం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మన్నెం పెదవెంగయ్య ఆకస్మిక మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్నలు శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారి కుట ఒబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలియజేశారు.

# లేడీ డాన్ నిడిగుంట అరుణపై పీడీ యాక్ట్ నమోదు

- ఎస్పీ ప్రతిపాదనలకు జిల్లా కలెక్టర్ ఆమోదం
- నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారంలో ఉన్న అరుణను కడప సెంట్రల్ జైలుకు తరలింపు
- జయప్రకాశ్, షేక్ షాహుల్ హమీద్ అనే మరో ఇద్దరి పైనా పోలీసులు పీడీ యాక్ట్
- నెల్లూరు నుంచి ముగ్గురిని కడప జైలుకు తరలింపు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో సంచలనం సృష్టించిన 'లేడీ డాన్' నిడుగుంట అరుణ పై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. ఆమె నేర చరిత్ర దృష్ట్యా ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్ట్‌ను ప్రయోగించారు. అరుణతో పాటు మరో ఇద్దరు రౌడీషీటర్లపై కూడా ఇదే చట్టం కింద కేసులు నమోదు చేసి, ముగ్గురినీ నెల్లూరు నుంచి కడప కేంద్ర కారాగారానికి తరలించారు. కోవూరు మండలం పెద్ద పడుగుపాడు గ్రామానికి చెందిన అరుణ భూ వివాదాలు, బెదిరింపులు, బ్లాక్ మెయిల్ వంటి అనేక నేరాలకు పాల్పడినట్లు పోలీసు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఆమెపై కోవూరు, నవాబుపేట, వేదాయపాలెం పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయి. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విజయవాడలో మోసాలకు పాల్పడిన కేసు కూడా ఆమెపై ఉంది. రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ వ్యవహారంలో పలు కథనాలు ప్రచురితం కావడంతో అరుణ నేర సామ్రాజ్యం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. దీంతో కోవూరు పోలీసులు ఆమెపై రౌడీషీట్ కూడా తెరిచారు.అరుణ నేర కార్యకలాపాలను అరికట్టేందుకు, ఆమెపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల.. కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ప్రతిపాదనలు పంపారు. కలెక్టర్ నుంచి ఆమోదం లభించడంతో కోవూరు పోలీసులు అరుణపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. ప్రస్తుతం నెల్లూరు జైలులో ఉన్న ఆమెను కడప సెంట్రల్ జైలుకు తరలించారు. అరుణతో పాటు నెల్లూరు నగరానికి చెందిన మరో ఇద్దరు రౌడీషీటర్లు ఎస్. జయప్రకాశ్, షేక్ షాహుల్ హమీద్‌లపైనా పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. వారిని కూడా నెల్లూరు నుంచి కడప కేంద్ర కారాగారానికి తరలించారు.

# రోడ్డు పోరంభోకు ఆక్రమణ తొలగింపు



వార్త ప్రచురించక ముందు ఫోటో

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు పట్టణంలో మెయిన్ రోడ్డు పక్కన జమున సినిమా హాల్ ముందు ఆక్రమణకు గురైన రోడ్డు పోరంబోకు స్థలాన్ని శుక్రవారం రెవెన్యూ, ఆర్ అండ్ బి శాఖ అధికారులు సంయుక్తంగా తొలగింప చేశారు. రూ.50 లక్షల విలువైన ఆర్ అండ్ బి స్థలం ఆక్రమణ' అనే శీర్షికన ఆగస్టు 25వ తేదీన **నేటి దినపత్రిక సూర్య**లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు రాజకీయంగా ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా లెక్కచేయక జమున సినిమా హాల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి ఆక్రమణలను తొలగింపజేసి విలువైన స్థలాన్ని కాపాడారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆక్రమణ తొలగించిన తర్వాత ఫోటో

# మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా శిబిరం







**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** ప్రజారోగ్యం పట్ల తమ నిబద్ధతను మరోసారి చాటుతూ, నెల్లూరు మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కాలేజీలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం, క్యాన్సర్ అవగాహన సదస్సు విశేష స్పందనతో అఖండ విజయం సాధించింది. గూడూరు పరిసర ప్రాంతాల నుండి వేల సంఖ్యలో ప్రజలు పాల్గొని, నిపుణులైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ శిబిరానికి మెడికవర్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ హరిప్రియ గూడే, డాక్టర్ డి.బాల ఖాసీం, సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ హాజరయ్యారు.ఉచిత వైద్య పరీక్షలు, కన్సల్టేషన్లు శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా సమగ్ర వైద్య పరీక్షలు అందించారు. ఈ పరీక్షల అనంతరం, నిపుణులైన వైద్యుల ఉచిత కన్సల్టేషన్లు పొందడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. ప్రజల నుండి వచ్చిన అద్భుతమైన స్పందన పట్ల మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది. భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ప్రజలకు మరింత చేరువవుతామని, మెరుగైన వైద్య సేవలను అందిస్తామని హామీ ఇచ్చింది.

# ఏపీ సీల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్‌గా మలిశెట్టి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకులు, పట్టణ మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఏఎంసీ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీలో పదవులు పొందారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసి పాదయాత్రలో కావలి పట్టణానికి లోకేష్ పాదయాత్రగా వచ్చినప్పుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మన్నవ రవిచంద్ర కావలిలో అలంకరించిన విద్యుత్ దీపావళి అలంకరణ చాలా మెచ్చుకున్న విషయం కూడా తెలిసినదే. పార్టీలో పడ్డ కష్టానికి ఫలితంగా తెలుగుదేశం పార్టీ ఉన్నత నాయకులు గుర్తించి ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడం జరిగింది. తను కార్యకర్తల పట్ల ఎంతో ప్రేమ అనురాగాలు చూపిస్తూ, తన దగ్గరకు వచ్చిన కార్యకర్తకు తను ఎంత వరికైనా సహాయం చేసేదానికి అండగా నిలబడే వ్యక్తి మలిశెట్టి అని, యువ నాయకుడు నారా లోకేష్ మనలను పొందిన వ్యక్తి రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్గా నియమించడం కావలి పట్టణంలో ఇదే తన అభిమానుల్లో తెలుగుదేశం పార్టీ నాయకుల్లో కార్యకర్తల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కావలి పట్టణంలో ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో జరుగుతున్న అంతర్ యుద్ధం ఎలా దారి తీస్తాయో వేచి చూడాలి.

# రాపూరు, కలువాయి మండలాల ప్రజల ఆందోళనలో నిజాయితీ వుంది

## సీఎం వాస్తవాలు గ్రహించమని బీజేపీ నేత మిడతల రమేష్ బహిరంగ లేఖ



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** విభజన చేయడం ముఖ్యమంత్రి నిర్ణయమని ఆందోళనలో పాల్గొనేందుకు కూటమి పార్టీల నేతలు సంశసిస్తున్నారు. ఇదే కూటమి ప్రభుత్వంలో ఆదోనిని ప్రత్యేక జిల్లా చేయమని తెలుగుదేశం బీజేపీ జనసేన కూటమి పార్టీల కార్యకర్తలు ప్రత్యక్ష ఆందోళన చేస్తున్నారు. ఆదోని విషయంలో రాజకీయ నాయకులది రాయలసీమ పౌరుషమా! నెల్లూరు రాజకీయ నాయకులకు ఆ మాత్రం పౌరుషం లేదా! అని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాపూర్ మండలంలో కండలేరు డ్యాం నిర్మాణంలో అనేక గ్రామాలు జల సమాధయ్యాయి. కండలేరు జలాశయం నుండి రాపూర్ మండలంలో 19 గ్రామాలకు ఇప్పటికి నీటి సౌకర్యం లేదు. 19 గ్రామాల నీటి కోసం కాలువ నిర్మాణం చేపడితే అటవీ అనుమతులు లేక కాలువనే రద్దు చేశారు. రాయలసీమ వాసులే వరుసగా ముఖ్యమంత్రులు అవుతుండడంతో వారికి ఒక న్యాయం మాకొక న్యాయమా అని రాపూర్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చెన్నై -బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే కొరకు పలమనేరు అటవీ ప్రాంతంలో ఏనుగుల సంచారమని ఏడు కిలోమీటర్లు భారీ వంతెనకు అటవీ శాఖ అనుమతులు ఇచ్చింది. పాలకులు నిర్లక్ష్యం వల్లనే రాపూర్ మండలంలో 30వేల మంది ప్రజలను జంతువుల కంటే హీనంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కండలేరు డ్యాం నీటి కోసమే రాపూర్ మండలాన్ని విభజిస్తున్నారనే సత్యాన్ని ఆందోళన రూపంలో విభజనను వ్యతిరేకిస్తున్నారు.. నెల్లూరు జిల్లాలో పాలకులు అధికారులు 30 సంవత్సరాలుగా నీరు అందించలేని వారు తిరుపతిలో కలిస్తే అభివృద్ధి భలే ఉంటుందని చెప్పడం అమ్మకు అన్నం పెట్టని వాడు చిన్నమ్మకు బంగారు నగలు చేయించినట్లుగా ఉంటుందని ప్రజల అభిప్రాయం. కలువాయి ప్రజలకు జిల్లా కేంద్రం నెల్లూరు 60 కిలోమీటర్ల కాగా తిరుపతి 140 కిలోమీటర్ల దూరంలో ఉంది. రవాణా వ్యయాన్ని తమ కాలాన్ని ఎందుకు నష్టపోవాలని కలువాయి ప్రజల ఆందోళనలో నిజాయితీ ఉంది. కండలేరు డ్యామ్ కోల్పోతే ప్రధానంగా వందల సంవత్సరాల నాటి కండలేరు నదిపై ఉన్న హక్కులను కోల్పోతామని మనుబోలు పొదలకూరు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కండలేరు డ్యాం నీటిపై 26 గ్రామాలు ఆధారపడి ఉన్నాయి. డ్యాం తిరుపతి ఆధీనంలోకి వెళితే.. నీటి లభ్యత కరువు సమయంలో అంతా రాష్ట్ర ఒప్పందాల ప్రకారం చెన్నైకి త్రాగునీరు పేరుతో తిరుపతి జిల్లాకు మాత్రమే నీటిని తరలించకు పోతారు. నెల్లూరు జిల్లా రాజకీయ పార్టీల నేతలకు ప్రశ్నిస్తే పదవులు పోతాయని తమకు సంబంధమే లేనట్లు ఎవరి వ్యాపారాలు వారు చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం తుది గెజిట్ పబ్లికేషన్ విడుదలకు 12 రోజులే గడువు ఉంది. నష్టపోయిన తర్వాత రాజకీయ నాయకుల ఓదార్పు యాత్రల తప్ప ప్రజల అభివృద్ధిని ఏనాడు చూడలేరు.

# 7వ వార్డులో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు, ప్రతి మున్సిపాలిటీ పట్టణం సుందరంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛంద- స్వర్ణాంధ్ర అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. వారి ఆదేశాల మేరకు శుక్రవారం కావలి పట్టణంలోనే ఏడవ వార్డు నందు పర్యావరణ రంగంలో స్వయంగా ఉపాధి అనే అంశంపై వ్యర్థాల నుండి హెూం కంపోస్టింగ్ తయారు చేసే విధానంపై శిక్షణ, విద్య తోటల పెంపకదారులకు శిక్షణ ఇచ్చి కావలి పురపాలక సంఘం వారు విండ్రో విధానం ద్వారా తయారు చేయబడిన సేంద్రియ ఎరువులను మిద్దె తోటల పెంపక దారులకు అందించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్, సానిటరీ సెక్రెటరీ, ప్రజలు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ పై కార్యదర్శులతో కమిషనర్ సమీక్ష

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ వారాంతపు సమీక్ష సమావేశంలో భాగంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లో టౌన్ ప్లానింగ్ సిబ్బందితో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన సీనియర్ బిల్డర్ ఎంఏ రఫిక్ పాల్గొని బిపిఎస్ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న బిల్డింగ్ అనుమతులను వారం రోజుల లోపే పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయడాన్ని ప్రత్యేకంగా అభినందించి కమిషనర్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమీషనర్ మాట్లాడుతూ.. ప్లానింగ్ కార్యదర్శుల లాగిన్లలో ఉన్న ఎల్ఆర్ఎస్ పాటర్న్ పరిశీలించి వెంటనే తదుపరి అనుమతుల కొరకు అధికారులకు పంపవలసిందిగా ఆదేశించారు. అలాగే గత వారం నుంచి ఈ వారంలోపు జరిగిన



ఎల్ఆర్ఎస్ పాటర్న్ గురించి కార్యదర్శి వారీగా సమీక్షించారు. అలాగే సచివాలయ పరిధిలోని అడ్వర్టైజ్మెంట్ పన్నులు, టెంపరరీ ఎంక్రోచ్మెంట్ పన్నులు గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు నివేదికను అందించవలసిందిగా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయానికి ఆదాయం వనరులు సమకూరేల ప్రతి కార్యదర్శి పనిచేయాలని నిర్దేశించారు. సచివాలయ పరిధిలోని గవర్నమెంట్ ఆస్తులను గుర్తించి వివరములను అందజేయవలసిందిగా ఆదేశించారు. కార్యాలయ పురోగతి పై నిర్దేశించిన పనులను తప్పక పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ హిమబిందు, డీసీపీ రఘునాథరావు, ఎసిపి వేణు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సతీష్, టీపీబిఓలు, ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిమలూరులో క్రైస్తవమతప్రచారం

- అక్రమఫిర్యాదు
- విహెచ్‌పి వినతిపత్రం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం మహిమలూరులోని అరుంధతీయవాడలో ఈనెల 8వతేదీ క్రిస్మస్ పేరుతో పలువురు పాస్టర్లు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు క్రైస్తవమత ప్రచారం చేశారని, అభ్యంతరం తెలిపినవారిపై అక్రమ ఫిర్యాదు చేశారని, ఈవిషయమై విచారించి తగు చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్, బిజెపి, మహిమలూరు, ఇంకా వివిధ గ్రామాల వారు గురువారం రాత్రి స్థానిక సిఐ గంగాధర్‌ను కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆత్మకూరు నుండి దాదాపు 40మంది ఆరోజు మహిమలూరుల అరుంధతీయవాడలో క్రైస్తవమతప్రచారం చేశారని, తమ గ్రామంలో క్రిస్టియన్లు ఎవరూ లేకున్నా ఎందుకు వచ్చి ర్యాలీగా తిరుగుతూ క్రైస్తవమత ప్రచారం చేస్తున్నారంటూ కొందరు అభ్యంతరం తెలుపగా ఎస్ఐ వెళ్ళి సర్దుబాటు చేసి పంపారు. అయితే పాస్టర్లు తమను అడ్డుకున్నారంటూ గ్రామస్థులపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విహెచ్‌పి, బిజెపి నాయకులు, మహిమలూరుకు చెందిన మరియు వివిధ గ్రామాలకు చెందిన వందలాదిమంది ఆత్మకూరు సిఐవద్దకు వచ్చి వినతిపత్రం అందజేసి జరిగిన వివరాలను వివరించారు. తమ మతమే గొప్పదని, క్రైస్తవమతంలోకి మారితే పవిత్రులవుతారంటూ వారు ప్రచారం చేశారన్నారు. ఈకాలనీలో క్రిస్టియన్లు లేరుకదా, ఇక్కడ ఎందుకు ప్రచారం చేస్తున్నారంటూ గ్రామస్థులు కొందరు అభ్యంతరం తెలిపారన్నారు. పోలీస్ అధికారుల సూచనలతో తాము సర్దుబాటు కాగా తమపైనే పోలీసులకు ఫిర్యాదు చేశారని వారు తెలిపారు. సోషల్‌మీడియా ద్వారా ప్రచారం కూడా చేశారన్నారు. దాంతో హిందూసంఘాలవారం వచ్చి వివరాలు తెలుపుతున్నామని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎస్సి సర్టిఫికేట్‌తో ఉద్యోగాలు పొంది క్రిస్టియన్ మతప్రచారంలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వాలు, న్యాయస్థానాలు ప్రకటించిన విధంగా హిందూగ్రామాల్లో కాలనీల్లో క్రైస్తవమత ప్రచారం నిర్వహించకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# నవ దంపతులు ఆత్మహత్య





**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని వరకవిపూడి గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకున్న దారుణ ఘటన గ్రామాన్నంతటిని కన్నీటి ప్రవంతిలో ముంచేసింది. భార్యాభర్తలైన ఈదూరు నరేష్ (34), ఆయన భార్య ప్రమీలమ్మ (28) ప్రస్తుతం ఆరవ నెల గర్భిణి ఇద్దరూ ఒకే చీరను ఉపయోగించి ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబంలో ఏం జరిగింది? ఈ అతి తీవ్రమైన నిర్ణయానికి ఎందుకు దారితీసింది? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇంకా బయటకు రావాల్సి ఉంది. గ్రామస్తుల సమాచారం ప్రకారం వారిద్దరి మధ్య కొంతకాలంగా చిన్నచిన్న మనస్పర్ధలు ఉన్నట్లు తెలుస్తోంది. 'చిన్న పాటి విషయాలకే ప్రాణాలు తీసుకోవడం ఎంత దారుణమో.. ఒక ప్రాణం కాదు, గర్భంలోని మరో జీవం కూడా అకాల మరణం పాలైంది' అంటూ గ్రామస్తులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో గ్రామం మొత్తంలో శోకసంద్రం అలుముకుంది. తల్లిదండ్రులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. వివాహిత దంపతులు ఇలాంటి నిర్ణయాలను తీసుకోకుండా, సమస్యలు వచ్చినప్పుడు పెద్దల సలహా తీసుకుని, మనోధైర్యంగా పోరాడాలని స్థానికులు భావోద్వేగంతో పిలుపునిస్తున్నారు. జీవితంలో సమస్యలు వచ్చినప్పుడు ఆత్మహత్య వంటి మార్గం ఎప్పటికీ పరిష్కారం కాదు. మనసులో బాధ, ఒత్తిడి, కలత ఉన్నప్పుడు నమ్మకమైన వారితో పంచుకోవాలి. కుటుంబం, స్నేహితులు, పెద్దల సలహాలు జీవితం నిలబెట్టగలవు. ఒక సమస్య కోసం రెండు ప్రాణాలు త్యజించడం దారుణం. జీవితం విలువైనది దాన్ని కాపాడుకోవాలి.

## ఈ-చలానాలను చెల్లించండి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌తో వాహనదారులు పెండింగ్లో ఉన్న తమ ఈ-చలానాల బకాయిలను చెల్లించి పరిష్కరించుకోవాలని ఉదయగిరి సిఐ ఎన్.వెంకటరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున సర్కిల్ పరిధిలోని వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## 16న మండల సర్వసభ్య సమావేశం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈనెల 16వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్ప నిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు.

## రీ సర్వే జాబితా ప్రకారం రిజిస్ట్రేషన్ చేసాము..

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి బిట్-5 లోని పట్టా భూమిని రీ సర్వే జాబితా ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు అనుసరిస్తూ రిజిస్ట్రేషన్ చేశామని అంతా చట్టబద్ధంగా జరిగినట్లు ముత్తుకూరు మండల కేంద్రం సబ్ రిజిస్టర్ ప్రసన్నలక్ష్మి తెలియజేశారు. శుక్రవారం సాయంత్రం కార్యాలయం వద్ద జరిగిన వివాదంపై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎల్పీ నెంబర్ 1750లో ఎకరా 25 సెంట్లు భూమి పట్టా భూమిగా ఉన్న నేపథ్యంలో రీ సర్వే జాబితాను పరిగణనలోకి తీసుకొని దీని ప్రకారం రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలియజేశారు. రిజిస్ట్రేషన్ చేసే సమయానికి రాష్ట్ర ప్రభుత్వ నిషేధ జాబితాలో ఈ భూమి లేనందు వల్ల రిజిస్ట్రేషన్‌కు సులభతరం అయినట్లు పైగా చట్టబద్ధంగా జరిగినట్లు సబ్ రిజిస్ట్రార్ పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని ఆమె చెప్పడం జరిగింది. 2018, 2019 సంవత్సరాలు కాలంలో ఇదే భూమి ప్రభుత్వ నిషేధిత జాబితాలో ఉందని సబ్ రిజిస్టర్ గుర్తు చేశారు.

## మేకపాటి శాంతి కుమారి నియామకంపై బొలినేని హర్షం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా గ్రంధాలయ చైర్మన్‌గా ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి సతీమణి మేకపాటి శాంతి కుమారి నియామకం పట్ల మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు హర్షం వ్యక్తం చేశారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాంతి కుమారి కి జిల్లా గ్రంథాలయ చైర్మన్గా ఎంపిక చేయడం అభినందనీయమన్నారు శాంతి కుమారి గ్రంథాల వ్యవస్థ అభివృద్ధికి పఠన అభివృద్ధికి కృషి చేయగలదని విశ్వాసం వ్యక్తం చేశారు.

## రైతులకు వరి విత్తనాలు పంపిణీ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** దిత్వా తుఫాన్ కారణంగా వరి నారుమళ్లు దెబ్బతిని నష్టపోయిన రైతులకు వరి విత్తనాల పంపిణీ శుక్రవారం తాళ్లపూడి గ్రామ కేంద్రంగా జరిగింది. ముఖ్య అతిథిగా టీడీపి ముత్తుకూరు మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ విచ్చేసి రైతులకు అందజేశారు. వరి విత్తనాలను 80శాతం శాతం రాయితీ పై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని రైతులకు తెలియజేశారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారిణి జ్యోత్స్న రాణి మాట్లాడారు. బాధిత రైతులు ఆధార్ కార్డు, పొలం పాసుబుక్ లేదా 1బి పత్రాలతో రైతు సేవా కేంద్రాలను సంప్రదించి విత్తనాలు పొందవచ్చునని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రసన్న కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్వసభ్య సమావేశం ఆదివారానికి వాయిదా

**జలదంకి, మేజర్‌న్యూస్ :** శుక్రవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం ఆదివారానికి వాయిదా పడినట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు అన్ని శాఖల అధికారులు, హాజరుకావాలని ఆయన కోరారు.

# యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన.. 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా






**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్క రించనందుకుగాను ఆత్మకూరులో శుక్రవారం డివిజన్‌యుటిఎఫ్ ఆధ్వర్యం లో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల18వతేదీన నెల్లూరు కలెక్టరేట్ ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారు. ఈకార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆర్డీవో కార్యా లయం ఎదుట నిరసన కార్యక్రమంలో నిర్వహించిన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా యుటిఎఫ్ నాయకులు ప్రసంగిం చారు. 2010కన్నా ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ పరీక్షనుండి మినహాయింపు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. పదవ తరగతి విద్యార్థుల 100రోజుల ప్రణాళికనుండి సెలవుదినాల్లో ఉపాధ్యా యులకు ఉపశమనం కల్పించాలని వారు కోరారు. 2010 సంవత్సరానికి ముందు నియామకమైన ఉపాధ్యాయులు ఇంటర్, డిగ్రీ, డిగ్రీ, బీఈడీ అర్హత కల్గినవారేనని, వారు ప్రభుత్వం నిర్వహించిన డిఎస్‌సిలో ఎంపికకాబడిన వారేనని, అలాంటి వారు టెట్‌లో ఉత్తీర్ణచెందాలని చెబుతుండడం సబబుకాదని నాయకులు పేర్కొన్నారు. సుప్రీమ్‌కోర్టులో సడలింపు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని వారు కోరారు. ఇంతవరకు ప్రభుత్వం రివ్యూపిటిషన్ దాఖలు చేయకపోవడం వలన ఉపాధ్యాయులు తీవ్ర మానసిక వత్తిడికి గురవుతున్నారని వారు పేర్కొన్నారు. 2025 జూన్‌లో జరిగిన బదిలీల్లో బదిలీఅయి రిలీవ్‌కాని ఉపాధ్యాయులగురించి, సింగిల్‌టీచర్ స్కూళ్ళ గురించి ఉపాధ్యాయులు సెలవులు వినియోగించుకునే అవకాశం లేకపోవడం గురించి, 10వతరగతి 100రోజుల ప్రణాళికలో పండుగలు, ఆదివారాలు తదితర సెలవుదినాల్లో పనిచేయాలని ఉత్తర్వులివ్వడం వలన ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని వారు పేర్కొన్నారు. ఈసమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈనెల 18వ తేదీన నెల్లూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా, ఆత్మకూరు, ఏఎస్‌పేట, మర్రిపాడు, అనంతసాగరం మండలాల అధ్యక్ష,కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్మశానంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు

## రజకసంఘనాయకులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి గ్రామ రజకుల శ్మశానవాటికలో ఎలాంటి ఇతర నిర్మాణాలు చేపట్టరాదని ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు నేరెళ్ళ శ్రీనివాసులు, వెంకట్రావుపల్లి గ్రామ రజకులు పేర్కొన్నారు. ఈ శ్మశానవాటికస్థలంలో మురుగునీటిశుద్ధి యంత్రాన్ని ఏర్పాటుకు అధికారులు యత్నిస్తున్నారని, దాంతో వారంతా శుక్రవారం ఆ శ్మశానవాటివద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ శ్మశానవాటికలో నీటిశుద్ధి యంత్రాన్ని ఏర్పాటుచేయబూనడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వారు పేర్కొన్నారు. నాలుగరకాల కులస్థులు నాలుగు తరాలనుండి శ్మశానవాటికగా వినియోగించుకుంటున్న స్థలంలో ప్రభుత్వం ఈప్లాంట్‌ను ఏర్పాటుచేయాలనుకోవడం సరికాదని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాలు ఎన్నో ఉండగా తమ శ్మశానవాటికలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించడం అత్యంత విచారకరమన్నారు. ఈప్లాంటు ఏర్పాటుకు రెండురోజుల క్రితం జెసిబితో సమాదులను త్రవ్వుతుండగా మహిళలు అడ్డుకున్నారని, తాము నేడు నిరసన తెలుపుతున్నామని, అధికారులు పరిశీలించి శ్మశానవాటికలో ప్లాంటు ఏర్పాటు యోచనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు నేరెళ్ళ శ్రీనివాసులు, రేకలగుంట అంకయ్య, గ్రామానికి చెందిన కరేటి విజయ్, అంకి పుల్లయ్య, పాతపాటి ప్రసాద్, వేటూరు అంకయ్య, జలదంకి బాలసుబ్రహ్మణ్యం, నాగమణి, కొండమ్మ, ప్రమీల, పలువురు గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో కదం తొక్కిన అంగన్వాడీలు

- ముఖ్యమంత్రి హామీలు అమలు చేయాలి
- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** గత ఎన్నికల సమయంలో అంగన్వాడీ కార్యకర్తలకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ అంగన్వాడీలు రోడ్డెక్కారు. తమకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్లు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలంటూ నెల్లూరు జిల్లా కలెక్టరేట్ వరకు కదం తొక్కారు. అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులో నిరసన తెలుపుతూ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు షేక్ రెహనాబేగం మాట్లాడుతూ పేదవర్గాలకు చెందిన కిషోర బాలికలు, గర్భవతులు, బాలింతలుకు ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు సేవలందిస్తున్నామని, అంగన్వాడీల సేవలతో శిశుమరణాలు, బాలింతల మరణాలు గణనీయంగా తగ్గాయన్నారు. అయితే ఇలాంటి సేవలు అందిస్తున్న అంగన్వాడీలకు 2019 నుండి వేతనాలు పెంచలేదని, సమస్యల పరిష్కారం కోసం 2023 డిసెంబర్లో 42 రోజుల పాటు సార్వత్రిక సమ్మె నిర్వహించినప్పుడు ప్రభుత్వం 2024 జూలైలో వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేతనాలు పెంచుతామని వాగ్దానం చేసిందని, గ్రాట్యూటి ఇస్తామని ఎన్నికల ప్రణాళికలో పేర్కొందని, 18 నెలలు అయినా ఇదిగో అదిగో అంటూ చెప్పడం తప్పిస్తే ఇప్పటి వరకు ఆచరణలో వేతనాలు పెంచలేదన్నారు, కనీస వేతనం 24,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీఐటియు నాయకులు, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎల్వి శేషమ్మ, కోశాధికారి మల్లెమ్మ కామాక్షమ్మ, సంపూర్ణమ్మ, పి రాధ, ప్రమీల, లక్ష్మీకాంతం, సుగుణమ్మ, మనస్తానమ్మ, మారెమ్మ, పుష్పలత, లతారెడ్డి, ఇంద్రావతి, షేక్ పద్మజ, రహంతున్నిసా, రూతమ్మ, సుభాషిణి, పావని, రజని, నాగభూషణమ్మ తదితర అన్ని ప్రాజెక్టుల నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ మరమత్తులు కారణంగా సరఫరా నిలిపివేత



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని విద్యుత్ పరిరక్షణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. నరుకూరు, కోడూరు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు ఈ నిలిపివేత వర్తించనుంది. చింతోపు, మంగలదొరువు, సౌత్ ఆములూరు, విలుకానిపల్లి, పొట్లపోడి, కొత్తపాలెం, వెంకన్నపాలెం, మహాలక్ష్మీపురం, కోడూరు తదితర గ్రామాల్లో 33 కెవి లైన్లపై జరుగుతున్న పరామర్శ/పరిరక్షణ (మెయింటెనెన్స్) పనుల కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈనిలిపివేత సమయంలో అత్యవసర పనులు ఉంటే ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రజలు అసౌకర్యం లేకుండా సహకరించాలని అధికారులు సూచించారు.

## బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది




**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని సైదాపురం పంచాయతీ పరిధిలో శుక్రవారం మురికిగా ఉన్నటువంటి ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్, డెటాల్ వాటర్ కలిపి పిచికారీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఇంద్రాణి మాట్లాడుతూ.. దోమలకును, ఇతర వైరసలను నివారించేందుకు గ్రామస్తులందరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు. తడిచెత్త పొడిచెత్త వెరు వెరు గా సపరేట్ చేయాలని తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ బొల్లిగర్ల శివకుమార్ యాదవ్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ సౌజన్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గిరిజన అధార్ నమోదు కేంద్రాని సద్వినియోగపరచుకోవాలని, ఎంపీడీఓ బి.శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఆధార్ కార్డు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేకపోతున్న గిరిజనులను చైతన్య పరిచి అధర్ నమోదు కేంద్రానికి తీసుకోచేలా ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకోవాలని తెలిపారు.

## 14న ప్రమాణస్వీకారం మహోత్సవం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని కృష్ణపట్నం గ్రామ సిద్దేశ్వర స్వామి, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం మహోత్సవం ఈనెల 14వ తేదీన ఆలయ ప్రాంగణంలో జరుగుతుందని ఆలయాల కార్యనిర్వహణ అధికారి గిరి కృష్ణ శుక్రవారం తెలిపారు. ట్రస్టీ సభ్యులు నూతన ఆలయ చైర్మన్‌ను ఎన్నుకుంటారని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పేర్కొన్నారు.

# యాచకుడు మృతి

**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో రోజువారీగా యాచక వృత్తిని చేపట్టే వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ మేరకు శుక్రవారం రాపూరు ఎస్ఐ ఎం వెంకటరాజేష్ అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాపూరు పట్టణంలో రోజువారీగా యాచకురుతిని చేపట్టే హిందీ మాతృభాషకు చెందిన వృద్ధుడు అనారోగ్యంతో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో మృతి చెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మృతి చెందిన వ్యక్తి వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట రాజేష్ తెలిపారు.

# ఓపెన్ ఫోరంలో 6 సమస్యలు సత్వర పరిష్కారం : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ నేతృత్వంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల ద్వారా కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ఓపెన్ ఫోరం కార్యక్రమం ద్వారా ప్రజలకు టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పిస్తున్నారు. అందులో భాగంగా నేడు నిర్వహించిన ఓపెన్ ఫోరమ్ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను టౌన్ ప్లానింగ్ విభాగం ఉన్నతాధికారులకు వివరించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అందుకున్న మొత్తం 20 సమస్యలలో 6 సమస్యలకు సత్వర పరిష్కారం అందించారు. 14 సమస్యలకు క్షేత్రస్థాయిలో పర్యటించిన అనంతరం పరిష్కారాలు అందజేస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఓపెన్ ఫోరం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం పొందామని స్థానిక జగదీష్ నగర్‌కు చెందిన శ్రీనివాసులు రెడ్డి, నవాబు పేటకు చెందిన వెంకట సురేష్‌లు హర్షం వ్యక్తం చేశారు. శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ 2020 సంవత్సరంలో కెవెస్‌ఆర్ కన్ స్ట్రక్షన్స్ ద్వారా నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం నిర్దేశించిన అనుమతుల మేరకు ఒక అపార్ట్మెంట్ నిర్మించామని తెలిపారు. అయితే నిర్మాణం పూర్తయిన తర్వాత మార్టగేజ్ విడుదలలో తీవ్రమైన జాప్యం జరిగి అపార్ట్మెంట్ వాసులకు సమస్యాత్మకంగా మారిందని వివరించారు. వెంకటసురేష్ మాట్లాడుతూ.. నవాబుపేట ప్రాంతంలో 2015వ సంవత్సరంలో అన్ని అనుమతులతో జి4 నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. నిర్మాణం అనంతరం మార్ట్ గేజ్ విడుదల చేయడంలో తీవ్ర జాప్యం జరిగిందని తెలిపారు. నెల్లూరు నగర పాలక సంస్థ నిర్వహిస్తున్న ఓపెన్ ఫోరం కార్యక్రమంలో సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చామని, వెంటనే మార్ట్ గేజ్ లు విడుదల చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం అందించారని సంతోషం వ్యక్తం చేసి కమిషనర్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఓపెన్ ఫోరమ్ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ హిమబిందు డి.సి.పి రఘునాథరావు, ఏ.సీ.పి వేణు, టి.పి.ఓ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా అయ్యప్ప స్వామి మండల పూజలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని వేదాయపాలెం అయ్యప్ప స్వామి దేవస్థానంలో మండల పూజలు శుక్రవారం కేరళ సాంప్రదాయ రీతిలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించి, కేరళ సాంప్రదాయ అర్చక తంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పూజల్లో భాగంగా స్వామి వారికి పలు విశేష సేవలు నిర్వహించారు. తొలుత స్వామి వారికి నిర్మాల్య దర్శనం, పాలాభిషేకం జరిగాయి. అనంతరం మహాగణపతి హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా సుగంధ పుష్పాలంకరణతో ఉషః పూజ, శ్రీ వేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం, ఉచ్చ పూజ సేవలు కనులపండువగా జరిగాయి. మధ్యాహ్నం మహా పుష్పభిషేకం, శ్రీ వేలి ఉత్సవం నిర్వహించారు.సాయంత్రం స్వామి వారికి పూలంగి సేవ దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూర దీపం, హరిహరాసనం సేవ జరిగాయి. ముఖ్యంగా భగవతి సేవలు అత్యంత వైభవంగా నిర్వహించడం భక్తులను ఆకట్టుకుంది. ఈ మండల పూజలకు పసుపులేటి అశోక్ చంద్ర, శివరాణి దంపతులు, బట్టేపాటి ప్రసాద్, మాధవి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే, అన్నదాన కార్యక్రమానికి చరణ్, శిరీష దంపతులు, రాత్రి స్వాములకు భిక్షకు పొనుగంటి రోహిత్, గోపాల్ సోనీ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను దేవస్థానం అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షించారు. కమిటీ సభ్యులు కత్తి మోహన్ రావు, కేజీ శంకరన్, బొగ్గుల మురళీమోహన్ రెడ్డి, పావలా ప్రసాద్, అశోక్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు సిటీలో కోర్టు నోటీసులకు నిరసన సెగ!





**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇంటి పన్నులు, కుళాయి పన్నుల బలవంతపు వసూళ్లకు వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. నగరంలో సుమారు 5,500 మందికి పన్ను బకాయిల పేరిట కార్పొరేషన్ అధికారులు జారీ చేసిన కోర్టు నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు, స్థానిక ప్రజలు నిరసన తెలిపారు. నెల్లూరు సిటీ 15వ డివిజన్‌లోని తుమ్మల కట్ట సంఘంలో పర్యటించిన సీపీఎం నాయకులు, నోటీసులు అందుకున్న పేద, మధ్యతరగతి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ జారీ చేసిన కోర్టు నోటీసులను స్థానిక ప్రజలు, సీపీఎం నాయకులు కలిసి తగలబెట్టి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ.. సామాన్య, మధ్య తరగతి ప్రజల మెడపై 'కోర్టు నోటీసు' పేరుతో కత్తి పెట్టి బలవంతపు వసూళ్లు చేయడం సరికాదని మండిపడ్డారు. 'మొదటి విడతగా 5,500 మందికి కోర్టు నోటీసులు ఇచ్చారు. పెన్నా నది ఒడ్డున నెల్లూరు నగరం ఉన్నా కూడా ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే దిక్కులేదంటూ ఆయన విమర్శించారు. కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, మంత్రి ప్రజల బాగోగులు పట్టించుకోకుండా, ప్రజల మీద బలవంతంగా వసూళ్లు చేసి కోట్ల రూపాయలు ఖజానా నింపుకోవాలనే ఆలోచనతో ఉన్నారని ఆరోపించారు. నోటీసులు ఉపసంహరించుకోకపోతే ఉద్యమం తప్పదు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ మస్తాన్ బీ, నగర కమిటీ సభ్యులు ఎన్‌వి సుబ్బమ్మ, కెవి రమణారెడ్డి, స్థానిక నాయకులు రెహనుమా, ప్రభాకర్, వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నిత్య అన్నదాన పథకంకు రూ.లక్ష విరాళం



**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు మండలం పెంచలకోన క్షేత్రంలోని శ్రీపెనుశిల నృసింహ స్వామివారి నిత్యాన్నదాన పథకంకు శుక్రవారం స్వామి వారి దర్శనానికి విచ్చేసిన తిరుపతి నగరంలోని ఎంసిఆర్ కాలనీకి చెందిన సున్నపు శ్రీనివాసప్రసాద్ ఆయన సతీమణి వర్ష తదితరులు రూ.లక్ష నగదును పెంచలకోన దేవస్థానం కార్యాలయంలో అందజేశారని అండ్ కార్యనిర్వహణాధికారి పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆలయ కార్యాలయం సిబ్బంది లక్ష్మీ నారాయణ, నరసింహ తదితరులు విరాళం రూపంలో అందించిన నగదును స్వీకరించారని దేవస్థానం ఉపకమీషనర్ అండ్ కార్యనిర్వ హణాధికారి పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.స్వామి వారి దర్శనార్థం విచ్చేసి నిత్య అన్నదాన పథకానికి లక్ష రూపాయలు విరాళం అందించిన సున్నపు శ్రీనివాస ప్రసాద్ కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేయడం జరిగిందని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ అండ్ ఈఓ వెల్లడించారు.

# రాజరాజేశ్వరి దేవికి రాహుకాల పూజలు





**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్ట లోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాహుకాల ఉద్యాపన పూజ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ విశేష పూజలో 43 మంది భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు శ్రీ అమ్మవారికి చీర, జాకెట్టు, 108 నిమ్మకాయల మాలలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాహుకాల దీపాలు చేసిన భక్తులు శ్రీ అమ్మవారిని దర్శించుకుని, దేవస్థానం వారు ఉచితంగా అందించిన బెల్లంపొంగలి ప్రసాదాన్ని స్వీకరించారు.భక్తుల భాగస్వామ్యంతో అన్నదాన కార్యక్రమం దేవస్థానం తరపున ప్రతి శుక్రవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు ఇచ్చిన విరాళముల ద్వారానే ఈ కార్యక్రమం నిర్వహించబడుతోందని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. శుక్రవారం రెండు వేల మంది భక్తులకు బయోమెట్రిక్ విధానం ద్వారా అన్నదానం చేయబడింది. అన్నదాన కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు. భక్తులు కూడా ప్రతి శుక్రవారం జరిగే ఈ పవిత్ర అన్నదాన కార్యక్రమానికి విరివిగా విరాళాలు అందజేయవలసిందిగా కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరారు. సాయంత్రం వేదపారాయణం సంధ్యామేళం, కుంభ హారతులు, పల్లకీ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు.

# శాంతకుమారికి పదవి పట్ల ఎమ్మెల్యే హర్షం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్గా మేకపాటి శాంత కుమారి నియామ కంపట్ల ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. టీడీపీలో కష్టపడిన వారికి సమ చిత స్థానం ఉంటుందనడానికి శాంత కుమారినే నిదర్శనమన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్రెడ్డి, ఆయన సతీమణి శాంత కుమారిలు ఎనలేని కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వారి కష్టాన్ని గుర్తించి జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్‌గా నియమించారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పార్టీలో కష్టపడ్డవారు ఇంకా చాలామంది ఉన్నారని, వారందరికీ సైతం త్వరలో పదవులు వరిస్తాయన్నారు.